బేసిన్ ప్రాజెక్టులకు ప్రాధాన్యమివ్వాలి

బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు తెలంగాణ వినతి

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): నీటి కేటాయింపులో బేసిన్‌లోని ప్రాజెక్టులకే ప్రాధాన్యం ఇవ్వాలని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు తెలంగాణ నివేదించింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సెక్షన్-3 మార్గదర్శకాల మేరకు ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పునఃపంపిణీకి సంబంధించి పునఃప్రారంభమైన బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ ఢిల్లీలో మంగళవారం కూడా కొనసాగింది. చైర్మన్ జస్టిస్ బ్రిజేశ్‌కుమార్, సభ్యులు జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్ తలపాత్ర ఎదుట తెలంగాణ సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలను కొనసాగించారు. తెలంగాణలో ఇప్పటికే నిర్మించిన, నిర్మాణంలో ఉన్న, భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టుల ప్రణాళికలను, అందులోని అంశాలను వివరించారు.

నకిరేకల్ పీఎస్‌లో కేటీఆర్‌పై రెండు కేసులు నమోదు

మన్నె క్రిశాంక్, కొణతం దిలీప్‌పై కూడా

నల్లగొండ ప్రతినిధి, మార్చి 25 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి మన్నె క్రిశాంక్, కొణతం దిలీప్‌కుమార్‌పై స్థానిక కాంగ్రెస్ నేతల ఫిర్యాదు మేరకు నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో రెండు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. నకిరేకల్‌లో పదో తరగతి తెలుగు పరీక్ష ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో సోషల్ మీడియా వేదికగా తమపై తప్పుడు ప్రచారం చేశారంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత, ఉగ్గిడి శ్రీనివాస్ వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక వెబ్‌సైట్‌లో వచ్చిన కథనాన్ని కేటీఆర్ ఎక్స్‌లో షేర్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేటీఆర్, మన్నె క్రిశాంక్, కొణతం దిలీప్‌కుమార్‌తో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. కాగా, ఈ పేపర్ లీక్ కేసులో పోలీసులు ఇప్పటివరకు ఒక మైనర్‌తోపాటు ఐదుగురిని అరెస్ట్ చేశారు. మరో ఆరుగురు పరారీలో ఉన్నట్టు తెలిపారు.

బాబా సాహెబ్‌కు ఎన్నాళ్లీ బంధనం?

మొదటిపేజీ తరువాయి...

కేటీఆర్ దీటుగా సమాధానమిచ్చారు. తెలంగాణ భాషకు, యాసకు ప్రాణప్రతిష్ట చేసింది కేసీఆర్ అని, 550 మంది కళాకారులతో సాంస్కృతిక సారథిని ఏర్పాటు చేసి, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ప్రభుత్వం నుంచి వేతనాలు అందించారని గుర్తుచేశారు.

వారసత్వ సంపదను కాపాడినం

వారసత్వ సంపదను బీఆర్‌ఎస్ హయాంలోనే పరిరక్షించామని కేటీఆర్ వివరించారు. 'రామప్ప ఆలయానికి మన రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా యునెస్కో గుర్తింపును తెచ్చింది బీఆర్‌ఎస్ హయాంలోనే.. అందుకు కేసీఆర్ విశేష కృషి చేసిండ్రు' అని గుర్తుచేశారు. హైదరాబాద్ నగరంలోని పాతబస్తీలో కులీ కుతుబ్‌షాహీ టూంబ్స్‌ను ఆగాఖాన్ ఫౌండేషన్ సహకారంతో తమ ప్రభుత్వం పునర్నిర్మించిందని చెప్పారు. 'యాదాద్రి టెంపుల్‌ను అంత అందంగా, అద్భుతంగా కట్టింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే. టెంపుల్ టూరిజాన్ని ముందుకు తీసుకెళ్లాలి.. కానీ మేము ఏమీ చేయలేదని ఎలా అంటున్నారు?' అని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు సంబంధించి మొజంజాహీ మార్కెట్‌ను అద్భుతంగా తీర్చిదిద్దామని, మురిగిచౌక్, మీర్ ఆలం ట్యాంక్ వంటి ఓల్డ్‌సిటీలో ఎన్నో వారసత్వ సంపదలను రిస్టోర్ చేశామని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలోనే రిలీజియస్, స్పిరిచువల్, ఈకో, మెడికల్, అడ్వెంచర్ టూరిజాలను అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. 'రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ దగ్గర టూరిజం అభివృద్ధి అవుతున్నదంటే కారణం.. వాటిని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించడం వల్లనే కదా? వాటి టూరిజానికి డబ్బులు కేటాయించింది బీఆర్‌ఎస్ కాదా? అనేది మంత్రి చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

పప్పు ఉడికినంక ఉప్పేసుడు కాదు

సాంస్కృతిక టూరిజంలో భాగంగా రాష్ట్రపతితో సహా దేశంలోని వివిధ ప్రముఖులను ఆహ్వానించి ప్రపంచ తెలుగు మహాసభలను బీఆర్‌ఎస్ హయాంలోనే ఘనంగా నిర్వహించామని కేటీఆర్ గుర్తుచేశారు. 2017లో గ్లోబల్ అంత్రప్రెన్యూర్ సమ్మిట్‌కు ప్రధాని మోదీ, ఇవాంక ట్రంప్‌ను తీసుకొచ్చి వైభవంగా నిర్వహించామని చెప్పారు. నాగార్జునసాగర్‌లో బుద్ధవనాన్ని నాటి నేతలు జానారెడ్డి ప్రారంభిస్తే.. దాన్ని పూర్తిచేసి జాతికి అంకితం చేశామని గుర్తుచేశారు. అక్కడ 200 ఎకరాలను స్పిరిచువల్ టూరిజంలో భాగంగా అభివృద్ధి చేసి కాంగ్రెస్ చేతిలో పెట్టామని చెప్పారు. ఇక కొల్లాపూర్‌లో కూడా సోమశిలను బ్రాహ్మాండంగా అభివృద్ధి చేశామని, రిసార్ట్‌లు, కాటేజ్‌లు కట్టి పూర్తి చేశామని తెలిపారు. 'వరంగల్‌లో కాళోజీ కళాక్షేత్రాన్ని 95 శాతం మేము పూర్తి చేసినం.. పప్పు ఉడికిన తర్వాత ఉప్పు వేసినట్టు మీరు చేసిండ్రు' అంటూ కేటీఆర్ చురకలంటించారు.

అమరుల స్తూపాన్ని పట్టించుకోండి

అమరవీరుల స్తూపాన్ని పట్టించుకోవాలని, అక్కడ కూడా టూరిజం అభివృద్ధి చెందుతుందని కేటీఆర్ సూచించారు. తెలంగాణ కవులు, కళాకారులు గోరటి వెంకన్న, రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్‌ను చట్టసభల్లోకి తెచ్చింది బీఆర్‌ఎస్, కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. '33 ఏండ్లకు ఓఆర్‌ఆర్‌ను టీవోటీ పద్ధతిలో ఇస్తే.. ఘోరం, స్కాం అన్నరు. మీ టూరిజం పాలసీలో ప్రభుత్వ భూములను 99 ఏండ్లు ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇస్తామని చెప్పిండ్రు. 33 ఏండ్లకు లీజుకిస్తే అదిపెద్ద స్కాం అయితది.. మరి 99 ఏండ్లకు అంటే జీవితకాలం ఇస్తే ఇదెట్ల న్యాయమైతది?' అంటూ నిప్పులు చెరిగారు.

హెచ్‌సీయూ విద్యార్థులకు కేటీఆర్ సంఘీభావం

హెచ్‌సీఎయూ భూములను కాపాడేందుకు ఉద్యమిస్తున్న విద్యార్థులకు కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. బీఆర్‌ఎస్ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆదివారం రాత్రి తెలంగాణ భవన్‌లో వర్సిటీ విద్యార్థులు కేటీఆర్‌ను కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీ భూములను వేలం వేసేందుకు కుట్ర చేస్తున్నదని వివరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సమస్యను కేంద్ర ప్రభుత్వంతో పాటు దేశంలోని వివిధ సెంట్రల్ యూనివర్సిటీల విద్యార్థుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఇందుకు కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. పోరాటానికి మద్దతు ప్రకటించిన కేటీఆర్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫార్ములా-ఈ తప్పయితే.. అందాల పోటీలు తప్పే

'ఓవైపు రాష్ట్రంలో 480 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నరు. పంటలు ఎండిపోయి ఏడుస్తున్నరు. తాగునీరు, సాగునీరు కరువైంది. ఇలాంటి పరిస్థితుల్లో.. అదీ మే నెలలో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించడం ఎందుకు?' అని కేటీఆర్ నిలదీశారు. 'మిస్‌వరల్డ్, మిస్ యూనివర్స్ పోటీలకు క్రేజ్ పోయింది. అదేదో గొప్పయి నట్టు.. ఆ ఈవెంట్‌ను మేమేదో అడ్డుకుంటున్నట్టు చెప్తున్నరు. ఈ మిస్‌వరల్డ్ పోటీల వల్ల ఆదాయం, కొలువులు వస్తయంటున్నరు. అవి ఎట్ల వస్తాయో చెప్పాలె' అంటూ మంత్రి జూపల్లిని ప్రశ్నించారు. 'మిస్‌వరల్డ్‌కు రూ.56 కోట్లు తప్పా? అని కాంగ్రెస్ నేతలు అంటున్నరు. మరి ఫార్ములా ఈ రేస్‌లో రూ.46 కోట్లు ఖర్చు పెడితే దాన్ని ఏకపక్షంగా క్యాబినెట్ ఆమోదం లేకుండా రద్దు చేశారు. అంత పెద్ద అంతర్జాతీయ ఈవెంట్‌ను రద్దు చేసినవాళ్లు.. ఇక్కడేమో ప్రభుత్వ డబ్బును ఖర్చు చేయడం న్యాయమెట్లా అవుతది?' అని సూటిగా ప్రశ్నించారు. 'ఇండియాలో యూనిట్ పెట్టాలనుకుంటున్న టెస్లా అనే ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీ.. ఫార్ములా-ఈ రద్దుతో వెనక్కి వెళ్లింది. మొదటి రేస్‌తో రూ.700 కోట్లు వస్తే.. రాష్ట్ర ప్రభుత్వం మూర్ఖంగా రద్దు చేయడమే కాకుండా.. 56 కోట్లు ఖర్చు పెట్టడం ఎంతవరకు సమంజసం? ఇది మీ డబుల్ స్టాండర్డ్ కాదా? ఇది మీ హిపోక్రసీ కాదా?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఫార్ములా-ఈ వల్ల మేం ఆశించింది తెలంగాణ మొబిలిటీ వ్యాలీ. దివిటిపల్లిలో అమర్‌రాజా బ్యాటరీలు తెచ్చినం.. 1200 ఎకరాల్లో మొబిలిటీ వ్యాలీ పెట్టినం.. జహీరాబాద్‌లో మ్యాను ఫ్యాక్చరింగ్ చేస్తున్నం. ఇన్ని చేసిన మా ప్రభుత్వాన్ని బద్నాం చేసిండ్రు. కానీ, అందాల పోటీలతో ఆదాయం వస్తది.. ఉద్యోగాలు వస్తయని చెప్తున్నరు. ఇదెట్లా సాధ్యమైతది? ఎవరిని మోసం చేయడానికి ఈ ప్రకటనలు?' అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

మెదక్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో పద్మాదేవేందర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, మధుసూదనాచారి, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఫరూఖ్ హుస్సేన్

వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులా?

- బయట ప్రశ్నిస్తే పోలీసు కేసులు శాసనసభలో ప్రశ్నిస్తే సస్పెన్షన్లు
- ప్రశ్నోత్తరాల సమయం ఎత్తేసిండ్రు
- దేవుళ్లపై ఒట్టేసి రేవంత్ మోసం
- వానకాలం రైతుబంధు ఎగ్గొట్టిండ్రు
- సంపూర్ణ రుణమాఫీ అయ్యేదాకా కాంగ్రెస్ సర్కార్‌ను వదిలిపెట్టం
- మెదక్‌లో మాజీ మంత్రి హరీశ్

మెదక్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బయట ప్రశ్నిస్తే పోలీసు కేసులు, అసెంబ్లీలో ప్రశ్నిస్తే సస్పెన్షన్లు అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. మెదక్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈ ప్రభుత్వంలో ఏడో గ్యారెంటీ లేకుండా పోయింది. ఇందిరా పార్కు దగ్గర ధర్నాలకు అనుమతి లేదు. ఆశ వర్కర్లు నిరసన తెలిపితే పోలీసులతో కొట్టిస్తున్నరు. సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మె చేస్తే అణచివేసిండ్రు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.2 లక్షల రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని ఎద్దేవాచేశారు. రేవంత్‌రెడ్డి దేవుళ్లమీద ఒట్టుపెట్టి రైతులను మోసం చేసిండని నిప్పులు చెరిగారు. 'అన్ని వర్గాలకు కాంగ్రెస్ దగా చేసింది. అసెంబ్లీలో మేం అడుగుతుంటే సమాధానం ఇవ్వకుండా ప్రతిదాడులు చేస్తున్నరు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయాన్ని ఎత్తేసిండ్రు' అని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులను రైతులు ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. 'బడా కాంట్రాక్టర్లకు రూ.14 వేల కోట్ల బిల్లులు ఇస్తున్నరు. రైతుబంధు కోసం ఇవ్వమంటే డబ్బులుండవు. రిటైర్డ్ ఉద్యోగులకు డబ్బులివ్వమంటే ఉండవు. ఇవాళ 25వ తారీఖు, అంగన్ వాడీలకు జీతాలు పడలేదు. 1వ తారీఖునే జీతాలిస్తామని చెప్పున్నరు.. మాటలే తప్ప చేతలు లేవు' అని నిప్పులు చెరిగారు. 'డబ్బుల్లేవంటూనే రూ.20 వేల కోట్లతో హెచ్‌ఎండీఏలో టెండర్లు ఎలా పిలుస్తున్నరు? రూ.15 వేల కోట్లతో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ టెండర్లు ఎట్లా పిలుస్తున్నరు? రూ.7 వేల కోట్లతో జీహెచ్‌ఎంసీలో టెండర్లు ఎలా పిలుస్తున్నరు? నీ భూములున్న మీ అత్తగారిల్లు ఆమనగల్‌కు రూ.5 వేల కోట్లతో 10 లైన్ల రోడ్డు ఎట్లా వేస్తున్నవు? ఫ్యూచర్ సిటీ పేరు మీద రూ.5 వేల కోట్లతో రోడ్డు ఎట్లా వేస్తున్నరు? అని ప్రశ్నించారు. సంపూర్ణ రుణమాఫీ అయ్యేదాకా సర్కార్‌ను వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

ప్రజలకు నిరాశే మిగిలింది : సిరికొండ

రాష్ట్రంలో భయంకర సమస్యలు వెంటాడుతున్నాయని మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి వాపోయారు. తమ జీవితాల్లో మార్పు వస్తుందనుకున్న రైతులు, ప్రజలకు నిరాశే మిగిలిందని చెప్పారు. సాంకేతిక అంశంపై తప్ప సభలో ప్రజల శ్రేయస్సు గురించి అధికార నేతలు ఏమాత్రం ప్రస్తావించడం లేదని తెలిపారు. చట్ట సభల స్థాయిని దిగజార్చిన చరిత్ర ఈ ప్రభుత్వానిదేనని ధ్వజమెత్తారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు తిరుపతి రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు జగపతి, మల్లికార్జున్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ కౌన్సిలర్లు ఆంజనేయులు, జయరాజ్, కిశోర్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటిపన్ను కట్టలేదని గేటు ఎత్తుకెళ్లిండ్రు

- అధికారులు మా పరువు తీసిండ్రు
- గడువు కోరినా వినిపించుకోకుండా దౌర్జన్యం
- నల్లగొండ పట్టణ వాసి ఆవేదన

నల్లగొండ సిటీ, మార్చి 25 : నల్లగొండ పట్టణంలోని గొల్లగూడలో మున్సిపాలిటీ అధికారులు ఓ కుటుంబంపై దౌర్జన్యానికి దిగారు. ఇంటి పన్ను కట్టలేదని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే గేటు ఎత్తుకెళ్లారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. సముద్రాల అంజయ్య నల్లగొండ పట్టణంలోని గొల్లగూడలో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా పొలం కౌలుకు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నేండ్లపాటు ఇంటిపన్ను సక్రమంగా కట్టినా.. ఇటీవల ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో పన్ను కట్టడం ఆలస్యమైంది. దాదాపు రూ.20 వేలు బకాయి ఉన్నది. మంగళవారం మున్సిపల్ అధికారులు అంజయ్య ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఆయన భార్య భాగ్యమ్మ ఇంట్లో ఉంది. ఎలాంటి నోటీస్ ఇవ్వకుండానే పన్ను బకాయి ఉందంటూ గేటు తీసుకెళ్లారు. డబ్బులు కట్టేందుకు గడువు కావాలని కోరినా వినిపించుకోలేదు. ఇది పద్ధతి కాదని పక్క ఇంటి వారు అనడంతో వారిని కూడా బెదిరించారు. 'మీది కూడా బిల్లు తక్కువ వస్తుంది.. రివైజ్ చేసి బిల్లు ఎక్కువ బిల్లు వచ్చేలా చేస్తాం' అంటూ బెదిరించారు.

మున్సిపల్ ఆటోలో అంజయ్య ఇంటి గేటు

మా ఇంటాయన వచ్చే దాక ఆగలేదు

అధికారులు మా ఇంటి గేటు ఎత్తుకెళ్లి పరువు తీసిండ్రు. పన్ను కట్టేందుకు సమయం కావాలన్నా వినిపించుకోలేదు. ఆ టైములో మా ఇంటి ఆయన లేడు. వచ్చే వరకు ఆగమన్నా ఆగకుండా గేటు తీసుకుపోయిండ్రు. గతంలో ఇంత దౌర్జన్యం ఎప్పుడూ లేదు.

-భాగ్యమ్మ, బాధితురాలు

నాపై మా వాళ్లే కుట్ర చేస్తున్నారు

- పీడీ యాక్ట్ పెట్టించింది బీజేపీ నేతలే
- పోలీసులే ఈ విషయం నాకు చెప్పారు
- రాజాసింగ్ సంచలన ఆరోపణలు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ): సొంత పార్టీ నేతలను ఉద్దేశించి బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీలోని కొందరు నాయకులు తనను వెన్నుపోటు పొడవడానికి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. గతంలో తనపై పీడీ యాక్ట్ నమోదయ్యేలా చేసింది కూడా బీజేపీలోని కొంతమంది నాయకులనేనని ఆరోపించారు. 'రాజాసింగ్.. మీపై పీడీ యాక్ట్ పెడుతున్నాం. మీ బీజేపీ వాళ్లు కూడా వేయండి అన్నారు' అని ఒక పోలీసు అధికారి తనతో చెప్పారని రాజాసింగ్ పేర్కొన్నారు. 'నేను జైల్లో ఉన్నప్పుడు నా వెంట నా అన్న ఉన్నాడు. మా కార్యకర్తలు నిలబడ్డారు. ఈరోజు కూడా నా అన్న నా వెంటే ఉన్నారని నేను అనుకుంటున్నా.. కానీ, మా అన్న ఎటువైపు ఉన్నారో మాకు అర్థం కావడం లేదు' అంటూ రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడి నియామకంపై కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో రాజాసింగ్ వరుసగా చేస్తున్న ఆరోపణల విషయంలో పార్టీ అగ్ర నాయకులు ఆగ్రహంతో ఉన్నట్టు సమాచారం. రెండు రోజుల క్రితం కూడా రాజాసింగ్ మాట్లాడుతూ, పార్టీ నుంచి పాత సామాన్లను బయట పడేయాల్సిందేనని వ్యాఖ్యానించారు. గతంలో కొంతమంది గ్రూపిజంతో పార్టీకి నష్టం చేశారని విమర్శించారు. తెలంగాణలో ఏ సీఎం వచ్చినా, అతడితో రహస్య సమావేశాలు నడిపి పార్టీకి నష్టం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా పార్టీ గెలవాలంటే మంచి నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు స్వేచ్ఛనివ్వాలని సూచించారు. కొత్త అధ్యక్షుడు సీక్రెట్ మీటింగ్‌లు పెట్టొద్దని సూచించారు.

మినిస్టర్ క్వార్టర్స్‌లోకి అధికార పార్టీ పెద్ద

- ఓ మంత్రి ఇల్లు బదలాయింపు
- ఆధునీకరణకు రూ.70 లక్షలు
- ఏఐసీసీకి సీనియర్ నేత ఫిర్యాదు

హైదరాబాద్, మార్చి25(నమస్తే తెలంగాణ): అధికార కాంగ్రెస్ పార్టీ పెద్ద ఒకరు త్వరలో మినిస్టర్ క్వార్టర్స్‌లోని ఓ ఇంటిలోకి గృహప్రవేశం చేయనున్నట్టు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. దక్షిణ తెలంగాణ జిల్లాలకు చెందిన ఓ మంత్రికి కేటాయించిన అధికారిక నివాసాన్ని, చట్టవిరుద్ధంగా ఆయనకు బదలాయిస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం శాసన వ్యవహారాల శాఖ రూ.70 లక్షలు ఖర్చు చేసి ఆ ఇంటిని ఆధునీకరిస్తున్నట్టు తెలిసింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీకే చెందిన ఓ సీనియర్ నేత ఈ విషయంపై ఏఐసీసీకి లేఖ రాసినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే ఆయనకు ప్రొటోకాల్‌కు విరుద్ధంగా ప్రభుత్వం పైలట్ వాహనాన్ని కేటాయించిందని, ఇప్పుడు క్వార్టర్ ఇవ్వడాన్ని ప్రతిపక్షాలు తప్పు పడుతున్నాయి.

పదవులు రాలేదనే అసంతృప్తి ఉంది

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పదవి రాకపోతే ఎవరికైనా అసంతృప్తి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం తాను కూడా అసంతృప్తితోనే ఉన్నానని వెల్లడించారు. పార్టీ అధిష్ఠానం ప్రాధాన్యతలేమిటో, రాష్ట్ర నాయకత్వం దేనిని పరిగణలోకి తీసుకొని పదవులు అప్పగిస్తున్నదో ముందు తెలుస్తుందన్నారు. అధిష్ఠానం సామాజిక న్యాయం పాటిస్తే.. దశాబ్దాల పాటు పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత అధిష్ఠానంపై ఉంటుందని స్పష్టంచేశారు.

ఏఐసీసీ డ్రాఫ్టింగ్ కమిటీలో భట్టికి చోటు

- ఏప్రిల్ 8, 9 తేదీల్లో అహ్మదాబాద్‌లో ఏఐసీసీ, సీడబ్ల్యూసీ ప్రతినిధుల సమావేశం

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) డ్రాఫ్టింగ్ కమిటీని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. ఈ కమిటీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు చోటుదక్కింది. ఈ కమిటీని ఏప్రిల్ 8, 9 తేదీల్లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగనున్న ఏఐసీసీ కీలక సమావేశాల కోసం ఏర్పాటుచేశారు. ఏప్రిల్ 8న సీడబ్ల్యూసీ సమావేశం, 9న ఏఐసీసీ ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నారు.

వ్యవసాయాధారిత పరిశ్రమగా తేనెటీగల పెంపకం

- మొజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ సైదయ్య

హైదరాబాద్, మార్చి 25 (నమస్తేతెలంగాణ) : తేనెటీగల పెంపకం వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా ఎదిగితే రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని మొజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య పేర్కొన్నారు. మంగళవారం కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని కూరగాయల పరిశోధన స్థానం నిర్వహణలో తేనెటీగల పెంపకం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించగా భూత్పూర్, పెద్దమందడి, కొత్తకోట మండలాల పరిధిలోని గ్రామాలకు చెందిన 30 మంది రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పిడిగం సైదయ్య మాట్లాడుతూ.. దేశంలో లభించే తేనే అత్యంత శ్రేష్ఠమైనదని, పోషక విలువలతోపాటు ఔషధ గుణాలు ఉండటం వల్ల ఎగుమతికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. శాస్త్రవేత్త నిఖిల్, ప్రధాన శిక్షకుడు, అసోసియేట్ ప్రొఫెసర్ షహనాజ్ మాట్లాడుతూ... ఆరు రోజుల శిక్షణలో తేనెటీగల జాతులు, పెంపకం, తేనె తీసే విధానం, తేనెటీగల పెంపకం ద్వారా లభ్యమయ్యే ఉత్పత్తులు, మార్కెటింగ్ మెళకువల గురించి శిక్షణ ఇస్తామని తెలిపారు.

'ఆశ'లపై సర్కారు నీళ్లు!

- ఆశ కార్యకర్తలపై చిన్నచూపు
- రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 15 నెలలైనా వేతనాలు పెంచలే
- ఉద్యోగ భద్రతకు దిక్కులేదు
- హామీలు నేరవేర్చమంటే దాష్టీకమా?
- బీఆర్‌ఎస్ పాలనలో వేతన పెంపు.. ఆశాలకు సముచిత గౌరవం
- కాంగ్రెస్ సర్కారుతో తాడోపేడో తేల్చుకుంటాం.. ఉద్యమం తప్పదు
- ప్రభుత్వానికి ఆశ కార్యకర్తల హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): ఏరు దాటే దాకా ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడ మల్లన్న అన్న చందంగా కాంగ్రెస్ సర్కారు తీరు ఉన్నది. నాడు అధికారమే పరమావధిగా ఆశ కార్యకర్తలకు అనేక హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మొండి'చెయ్యి' చూపుతున్నది. కష్టానికి తగ్గట్టు రూ.18 వేల వేతనం ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, హెల్త్‌కార్డులు ఇస్తామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పెట్టింది. అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క ఎన్నికల సభల్లో పదే పదే ఊదరగొట్టారు. ఇప్పుడు గద్దెనెక్కి 15 నెలలైనా ఆ ఊసే ఎత్తడం లేదు. అటు వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, ఇటు మంత్రికి విన్నవించినా పట్టించుకోవడం రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష ఆవేదన వ్యక్తం చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా గోపాల్‌పేటలో నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

నాడు గౌరవం పెంపు.. నేడు మర్యాద కరువు

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 28,162 మంది ఆశ కార్యకర్తల సేవలను గుర్తించి నాడు బీఆర్‌ఎస్ సర్కారు వారికి సముచిత గౌరవమిచ్చింది. కాంగ్రెస్ హయాంలో వేతనం రూ.1,200 మాత్రమే. అది కూడా మూడు, నాలుగు నెలలకోసారి ఇచ్చేవారు. కానీ, కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2017 మే నెలలో రూ.6 వేలకు వేతనం పెంచారు. మళ్లీ అదే ఏడాది సెప్టెంబర్‌లో అడగకుండానే రూ.7,500 చేశారు. అంతేగాకుండా ఉద్యోగుల మాదిరిగా పీఆర్సీ పరిధిలోకి తెచ్చారు. 2020లో పీఆర్సీకి అనుగుణంగా 30 శాతం అంటే రూ.9,750కి హెచ్చించారు. అలాగే క్రమం తప్పకుండా ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలను ఖాతాల్లో జమ చేసేవారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి నుంచి మూడు నెలల పాటు వేతనాలు నిలిపివేశారని యూనియన్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఆందోళనకు దిగితే రెండు, మూడు నెలలు సక్రమంగా ఇచ్చి తిరిగి ఆపివేశారని, పెద్దఎత్తున ధర్నా, నిరసనలకు ఉపక్రమించిన తర్వాత ప్రభుత్వంలో కదలిక వచ్చిందని చెబుతున్నారు. కాంగ్రెస్ హయాంలో తమ సేవలను గుర్తించడం లేదని వాపోతున్నారు. గతంలో ప్రతినెలా తమ సమస్యలపై మంత్రి, అధికారులు సమీక్ష నిర్వహించేవారని, ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దాడులు చేయిస్తున్న సర్కారు

ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అడిగితే సర్కారు తమపై దాష్టీకానికి దిగుతున్నదని ఆశ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుడు డిసెంబర్ 9న హైదరాబాద్‌లో శాంతియుతంగా నిరసన తెలిపిన తమపై పోలీసులతో సర్కారు దాడులు చేయించిందని వాపోతున్నారు. నేరస్థులు, అసాంఘిక శక్తుల మాదిరిగా మగ పోలీసులు చితకబాది, వ్యాన్లలో లాగిపడేసినట్టు చెబుతున్నారు. రెండ్రోజుల క్రితం కోఠిలో ఆందోళన చేసిన ఆశ కార్యకర్తలపై ఇదే రీతిలో జులుం ప్రదర్శించారని కన్నీటిపర్యంతమవుతున్నారు. 'మేం ఏం తప్పు చేశాం? ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడగడమే పాపమా?' అని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ వస్తే వేతనాలు పెరుగుతాయనకున్న తమ ఆశలపై సర్కారు నీళ్లు చల్లిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు మంత్రులు, అధికారులను అడిగినా నిధుల్లేవని సాకులు చెబుతున్నారని మండిపడుతున్నారు.

తాడోపేడో తేల్చుకుంటాం

సమస్యలు పరిష్కరించాలని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. ఖజానాలో నిధులు లేవని సాకులు చెబుతూ తప్పించుకుంటున్నది. కేసీఆర్ పాలనలో గౌరవంగా విధులు నిర్వర్తించిన తమను చిన్న చూపు చూస్తున్నది. ఆందోళనకు దిగితే పోలీసులతో దాడులు చేయిస్తున్నది. ఇక ఈ ప్రభుత్వాన్ని ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టేది లేదు. అసెంబ్లీకి వెళ్లి మంత్రులకు వినతిపత్రాలు అందజేస్తాం. త్వరలో సమావేశమై ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం. సర్కారుతో తాడోపేడో తేల్చుకుంటాం.

– సంతోష, ఆశ కార్యకర్తల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు (బీఆర్టీయూ)

3,179 హ్యాబిటేషన్స్‌లో సర్కారు బడి లేదు

- ప్రాథమిక బడిలేని ఆవాసగ్రామాలు 385
- ప్రాథమికోన్నత బడిలేనివి 1,955, ఉన్నత పాఠశాలలు లేనివి 2,158

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : 'రాష్ట్రంలో బడిలేని ఊరు ఉండొద్దు. ప్రతి ఊరిలో బడి ఉండేలా చూస్తాం. కొత్త బడులు తెరుస్తం' ఇది విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి మాటలు. విద్యాశాఖకు సీఎమ్మే మంత్రి కూడా. కానీ 15 నెలల కాంగ్రెస్ పాలనలో రేవంత్‌రెడ్డి మాటలు ఉత్తవే అయ్యాయి. రాష్ట్రంలో ఇప్పటికీ సర్కారు బడులు లేని హ్యాబిటేషన్స్ ఉన్నాయి. విద్యాశాఖ ప్రకటించిన లెక్కల ప్రకారం రాష్ట్రంలోని 3,179 హ్యాబిటేషన్స్‌కు సర్కారు బడులు అందుబాటులో లేవు. ఇవేవే ఉత్తుత్తి లెక్కలు కాదు. సాక్షాత్తు పాఠశాల విద్యాశాఖ ప్రకటించిన అధికారిక లెక్కలు. ఈ 3,179 హ్యాబిటేషన్స్‌లోని 21,806 మంది విద్యార్థులు బడి సౌకర్యం లేక ఆపసోపాలు పడుతూ పక్క గ్రామాల్లోని బడుల్లో చేరుతున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఒక కిలోమీటర్ లోపు ప్రాథమిక బడి, ఐదు కిలోమీటర్ల లోపు ఉన్నత పాఠశాలలు ఉండాలి. ఈ పాఠశాల వసతిలేని పిల్లలకు విద్యాశాఖ రవాణాభత్యం విడుదల చేయాలి. రాష్ట్రంలోని 3,179 హ్యాబిటేషన్స్‌లో పాఠశాల లేకపోవడంతో 21వేల చిన్నారులకు పాఠశాల విద్యాశాఖ రవాణాభత్యం విడుదల చేసింది. ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున 10 నెలలకు రూ. 6వేలు ఇస్తారు. ఇలా 21వేల మందికి రూ. 13.08 కోట్లు మంజూరుచేసింది.

వాస్తవాలిలా..

- జిల్లాలవారీగా తీసుకుంటే అత్యధికంగా ఖమ్మంలో 276, ఆ తర్వాత భద్రాద్రి కొత్తగూడెంలో 259, సిద్దిపేటలో 241 హ్యాబిటేషన్స్‌లో పాఠశాలలు అందుబాటులో లేవు.
- వందకుపైగా బడులు అందుబాటులో లేని హ్యాబిటేషన్స్ అనేకమున్నాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో 163, ఆదిలాబాద్‌లో 154, జనగాంలో 116, మహబూబాబాద్‌లో 107, మెదక్‌లో 100, నల్లగొండలో 195, నారాయణపేటలో 102, సంగారెడ్డిలో 108, సూర్యాపేటలో 163, యాదాద్రి భువనగిరి జిల్లాలో 116 హ్యాబిటేషన్స్‌కు అందుబాటులో సర్కారు బడులు లేవు.
- రాష్ట్రంలోని 385 హ్యాబిటేషన్స్‌కు ప్రాథమిక పాఠశాలలు అందుబాటులో లేకపోవడంతో 2,510 మంది, 1,955 హ్యాబిటేషన్స్‌లో ప్రాథమికోన్నత పాఠశాలలు అందుబాటులో లేకపోవడంతో 10,709 మంది, 2,158 హ్యాబిటేషన్స్‌లో ఉన్నత పాఠశాలలు లేకపోవడంతో 8,585 మంది విద్యార్థులు సమీప గ్రామాల్లో చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది.

శాతవాహన వర్సిటీకి ఇంజినీరింగ్ కాలేజీ

- హుస్నాబాద్‌లో కాలేజీ ఏర్పాటుకు జీవో జారీ
- వర్సిటీ ఓ చోట.. కాలేజీ మరోచోటపై విమర్శలు

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : శాతవాహన యూనివర్సిటీకి ప్రభుత్వం కొత్తగా ఇంజినీరింగ్ కాలేజీని మంజూరుచేసింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో కాలేజీని ఏర్పాటు చేస్తూ మంగళవారం జీవో-18ని జారీచేసింది. యూనివర్సిటీ ఎక్కడుంటే, మిగతా విభాగాలను అక్కడే ఏర్పాటు చేయడం సహజం. కానీ ఇందుకు విరుద్ధంగా శాతవాహన యూనివర్సిటీ కరీంనగర్‌లో ఉంటే, ఇంజినీరింగ్ కాలేజీని హుస్నాబాద్‌లో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాలేజీ సరే.. పోస్టులేవీ..?

కొత్త ఇంజినీరింగ్ కాలేజీలో నాలుగు కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. సీఎస్‌ఈ, ఈసీఈ, ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. ఒక్కో కోర్సులో 60 సీట్లుండగా 2025-26 విద్యా సంవత్సరంలో సీట్లను భర్తీచేస్తారు. కాలేజీలో 70 పోస్టులు కావాల్సి ఉండగా, ప్రభుత్వం మంజూరుచేయకపోవడం గమనార్హం.

లా కాలేజీ, ఎం ఫార్మసీ కోర్సు

ఇదే వర్సిటీలో కొత్తగా లా కాలేజీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో-19ని జారీ చేసింది. మూడేండ్ల ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సులను నిర్వహిస్తారు. కొత్తగా బీ ఫార్మసీ కాలేజీలో ఎం ఫార్మసీ కోర్సుకు సైతం అనుమతి లభించింది. ఎం ఫార్మసీ కోర్సు పూర్తిగా సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సు.